కంచుకూరి వెంకట మహాలక్ష్మి

# తియ్యటి శిక్ష

"స్టార్టు ఇమీడియట్లీ" అన్న టెలిగ్రామ్ అందుకుని ఆదరాబాదరాగా గోదావరి ఎక్స్ప్రెస్‌లో బయలుదేరి హైదరాబాద్‌కి వచ్చింది స్వప్న.

"ఇంత అర్జంట్‌గా రమ్మన్నారు. ఇంటిదగ్గర ఎవరికేనా ఆరోగ్యం బాగాలేదేమో" అని రైల్లో అంతా ఆదుర్దాపడుతూనే ప్రయాణం చేసింది.

ఇంటికొచ్చిన స్వప్న ఆలోచనలన్నీ తారుమారయ్యాయి. ఇంట్లో అంతా ఏదో హడావుడిగా సందడిగా వుండడం ఆమెకి ఆశ్చర్యమనిపించింది. పైగా వదిన ఎదురొచ్చి "కంగ్రాచ్యులేషన్స్ స్వప్నా? ఎంత అదృష్టవంతురాలివి తల్లీ" అంది నవ్వుతూ.

స్వప్నకి ఏమీ అర్థమవటం లేదు. 'అసలు ఎందుకు రమ్మని వైరిచ్చారు? ఈ హడావిడంతా ఏమిటి? పైగా వదిన నాకు కంగ్రాచ్యులేషన్స్ చెప్తోందేమిటి?' అని ఆశ్చర్యపోతూ "ఎందుకు నన్ను రమ్మని వైరిచ్చారు" అంది.

"మరీ అలా నంగనాచిలా మాట్లాడకమ్మా తల్లీ" అంటూ మంచినీళ్ళ గ్లాసందించింది వదిన.

"ఏమిటొదినా! ఏమిటి నా నంగనాచితనం? అసలు సంగతి చెప్పకుండా ఏమిటీ సస్పెన్స్" అంది కాస్త విసుగ్గా పక్కగానున్న కుర్చీలో కూలబడుతూ.

"అవునులే. ఇంత తొందర్లో ముహూర్తాలు పెట్టించేస్తారని అనుకుని వుండవు. అందుకే ఇలా తెల్లబోతున్నావు" అంది మళ్ళీ వేళాకోళంగానే.

ఈసారి నిజంగానే స్వప్న ఒళ్ళు మండింది. ప్రయాణం అలసట, పైగా టెలిగ్రామ్‌లో అసలు విషయమేమిటో తెలీక ఆందోళన. దానికి సాయం ఇప్పుడు వదిన ఆడిన మాటలు–చర్రున లేచి నిల బడింది. తిన్నగా తల్లిదగ్గరికెళ్ళి "ఎవరికీ పెళ్ళి" అంది కోపంగానే.

"నీకేనమ్మా! అయినా రైలు దిగిన వెంటనే ఏమిటీ గొడవ! వెళ్ళి స్నానంచేసిరా. కాఫీ తాగుదువుగాని, తరవాత వివరాలు అడుగుదువు గాని, మీ నాన్నకూడా వచ్చేస్తారు కొంచెం సేపట్లో. అన్నీ ఆయనే చెప్తారు. నా కవతల బోల్డు పనులున్నాయి" అంది కాస్త విసుగ్గా.

పట్టలేని దుఃఖమొచ్చింది స్వప్నకి. ఇంక వీళ్ళతో మాట్లాడి ప్రయోజనం లేదనుకొంది. తిన్నగా తన గదిలోకి వెళ్ళి తలుపులేసుకుంది. మంచంమీద పడుకున్న స్వప్న మనస్సు ఆందోళనగానూ, చికాకుగానూ వుంది.

"అకస్మాత్తుగా ఈ పెళ్ళేమిటి? వీళ్ళిలా ప్రవర్తిస్తున్నారేమిటి? నాకు తెలీకుండా నా పెళ్ళిపనులు జరిగిపోతున్నాయి. ముహూర్తం కూడా పెట్టేసారా? ఇంతకీ పెళ్ళికొడుకెవరు? పెళ్ళి నిశ్చయించేసారా? ఏమిటీ మనుష్యులు! నా ఇష్టాయిష్టాలతో వీళ్ళకేం నిమిత్తం లేదా?"

"అసలు బి.ఎస్సీ అయిపోగానే పెళ్ళి చేస్తా" నని అమ్మ పట్టుబడితే క్లాసొచ్చింది. ఇప్పుడే పెళ్ళి చేసుకోనని మొండి పట్టుపట్టి తండ్రిని ఒప్పించి ఎమ్మెస్సీలో చేరింది. మొదటి సంవత్సరం పూర్తయింది. మరో ఏడాదికి తన చదువు పూర్తి అవుతుంది. నిజానికి పెళ్ళంటే విముఖత లేదు. కానీ పోస్టుగ్రాడ్యుయేట్ అవ్వాలని, కొన్నాళ్ళు ఉద్యోగం చెయ్యాలని వున్న తన కోరిక తీరేకే పెళ్ళి చేసుకోవాలనుకుంది. ఇవన్నీ తల్లిదండ్రులతో చెప్పకుండా "ఎమ్మెస్సీ చదువుకోవాల"ని వుందని మాత్రం చెప్పి యూనివర్సిటీలో చేరింది. మొదట్లో వద్దన్నా తన పట్టుదల వల్ల చేర్పించక తప్పలేదు వీళ్ళకి. కానీ మళ్ళీ మధ్యలో ఇలా చేసారేమిటి? ఇదేం పూర్వకాలమా? లేక బొమ్మలపెళ్ళా? ఇప్పుడేం కొంప మునిగిపోయిందని నాకు చెప్పకుండా, నా ప్రమేయం లేకుండా అన్నీ కుదిర్చేసి ఈ ముహూర్తం కూడా పెట్టేశారు? అనుకుంటూ పిచ్చిగా ఆలోచిస్తున్న స్వప్నకి ఆలోచనలతో బుర్రలోని నరాలన్నీ వేడెక్కి తల తిరిగిపోసాగింది. ఏం చెయ్యలేక ఒంటరిగా పడుకుని కరువుతీరా ఏడ్చింది.

ఇంతలో హాలులో తండ్రి మాటలు వినిపించాయి. "స్వప్న వచ్చిందండీ!" అని తల్లి చెప్పింది. "ఏదీ?" అని తండ్రి అడగటంతో లేచి కళ్ళు తుడుచుకుంది. తండ్రి ఎదుటికెళ్ళి గట్టిగా అడిగే ధైర్యం స్వప్నకి లేదు. తల్లిదగ్గరున్న చనువు తండ్రి దగ్గర లేకపోవడమే దీనికి కారణం కాకుండా, ఆ యింట్లో ప్రతి ఒక్కరికి యజమానిగా శేషయ్యగారంటే భయం, భక్తి, గౌరవం వున్నాయి. ఆయన ఏనాడూ ఎవ్వరికీ ఏ లోటూ చెయ్యలేదు. తన పెద్దరికాన్ని నిలుపుకుంటూ, ఇంటి పెత్తనాన్ని సక్రమంగా నిర్వర్తిస్తున్నాడు. ఆయన ఏది చేసినా అది మంచికే అన్న భావం ఇంట్లో ప్రతి ఒక్కరికీ వుండటమే, ఈనాడు స్వప్న ఎదురెళ్ళి తండ్రిని తన ప్రశ్నలన్నింటికీ సమాధానాలడగలేకపోవడానికి కారణం కూడ.

"వచ్చావాతల్లీ! ప్రయాణం బాగా జరిగిందా?" అన్నాడు ఆప్యాయంగా స్వప్నని చూస్తూ. ఆ చూపులో ఎనలేని ఆనందం, తృప్తి గోచరించాయి స్వప్నకి. ఏదో అడగాలనుకున్న స్వప్న ఏమీ మాట్లాడలేక "బాగానే జరిగింది నాన్నగారూ!" అంది రాని నవ్వు ముఖానికి పులుముకుంటూ.

"పోయి రెస్టు తీసుకో! మధ్యాహ్నమో, రేపో బజారుకెళ్ళి నీ చీరలూ, నగలూ చూద్దాం" అని వెళ్ళిపోయిన తండ్రిని పిచ్చిదానిలా చూస్తూ నిలబడిపోయింది స్వప్న.

గదిలోకొచ్చి పడుకుంది. మళ్ళీ ఆందోళన, ఆలోచనలు మనస్సుని కాల్చేస్తున్నాయి. ఇలా మరికొంచెంసేపు ఆలోచిస్తే పిచ్చెక్కిపోయేలా వుంది. ఇంట్లో అంతా ఆనందంగా, హడావిడిగా వున్నారు. తనకేం అర్థంకాక అయోమయంగా

**తల్లి మాటలు విన్న స్వప్న పరిస్థితి మరీ అయోమయంగా తయారయింది. ప్రమోద్ తనూ ఒకే కాలేజీలో చదివినమాట నిజమే! కానీ తను ఎన్నడూ అతన్ని స్నేహితునిగా తప్ప మరో దృష్టితో చూడలేదు.**

వుంది. 'ఎవర్నడిగి విషయం తెలుసుకోవాలి? ఇలా బాధపడుతూ కూర్చుంటే పరిస్థితులింకా విషమించొచ్చు. కర్తవ్యమాలోచించాలి. వీళ్ళ వ్యవహారం చూస్తుంటే ముహూర్తం త్వరలోనే లాగ వుంది. ఎవర్నడగాలి? అమ్మ లోపలి పనులతో సతమతమవుతోంది. అడిగినా చెప్పదు. నాన్ననడిగే ధైర్యంలేదు. అయినా ఏమని అడుగుతుంది? అందుకు తనకంటే కాస్త పెద్దదయిన వదిన్నే మెల్లిగా పిల్చి వివరాలు రాబట్టాలి' అనుకుని లేచి "వదినా!" అని పిల్చింది.




గదిలోకొచ్చిన వదిన్ని మంచంమీద కూర్చోమని చేత్తోటే సౌంజ్ఞ చేసింది.

"వదినా! నేనడిగినదానికి హాస్యమాడకుండా జవాబు చెప్తావా?" అంది సర్దుకుని కూర్చుంటూ.

"అదేమిటి స్వప్నా! అలా అడుగుతావు? ఎప్పుడు చెప్పలేదుగనక! అయినా నీ సందేహం ఏమిటి?" అంది ఆప్యాయంగా స్వప్న భుజం మీద చెయ్యివేసి.

"అదికాదొదినా! ఈ పెళ్ళేమిటి? నాకు తెలియకుండా నా పెళ్ళెలా నిశ్చయించారు? పెళ్ళికొడుకెవరు? అసలివన్నీ ఎవర్ని అడిగి చేస్తున్నారు?" అన్న స్వప్న ప్రశ్నలు విన్న వదిన ఆశ్చర్యపోయి చూస్తూ "అదేమిటి స్వప్నా! నువ్వు చేసుకోవాలనుకున్న పెళ్ళికొడుకేకదమ్మా అతను!" అన్నదానికి చకితురాలై, "నేను చేసుకోవాలనుకోవడం ఏమిటి? ఇంతకీ ఎవరతను?" అంది.

"నీ కాలేజీలో చదివేడుటకదమ్మా! నువ్వు బి.ఎస్సీలో వుండగా అతను ఎమ్మెస్సీ చేసాడుట! మీ యిద్దరికీ బాగా పరిచయం వుందిటకదా!" అంటూ లేచి వెళ్ళి శుభలేఖ తెచ్చిఇచ్చింది.

ఆతృతగా దానిని అందుకుని చదవసాగింది. చి॥ ల॥ సౌ॥ స్వప్నను డాక్టర్ ప్రమోద్ ఎమ్మెస్సీకి ఇచ్చి...

"అంటే! వచ్చే వారంలోనే పెళ్ళన్నమాట! ఈ ప్రమోద్ వీళ్ళకెలా పరిచయం అయ్యాడు? ! నేను అతన్ని చేసుకోవాలనుకోవడం ఏమిటి?" అని ఆశ్చర్యపోతూ కార్డు పక్కకు పెట్టింది. మళ్ళీ ఆలోచనలు బుర్రలో గిర్రున తిరగసాగాయి. ఏదో అడగాలని ప్రక్కకి చూసేసరికి వదిన ఆ గదిలో లేదు. ఇంక ఆమెని ఏమడిగీ ప్రయోజనం లేదనుకుంది.

రాత్రిదాకా తనలో తనే మధనపడుతూ కూర్చున్న స్వప్న తల్లిదగ్గరకి మెల్లిగా చేరి "ఈ సంబంధం మీకు ఎవరు చెప్పారమ్మా! అసలిప్పుడు నా పెళ్ళి ఇంత త్వరగా చేసెయ్యాలని మీకెందుకు తొందరొచ్చింది? కనీసం ఇంకొక్క ఏడాది ఆగివుంటే ఈ చదువు పూర్తయ్యేది కదమ్మా" అంది బాధగా.

"ఏమో తల్లీ! నాకేం తెలీదు. మీ నాన్నగారి స్నేహితుడు రామయ్యగారొచ్చి ఆ పెళ్ళికొడుకు నిన్ను తప్ప చేసుకోనంటున్నాడని, సాంప్రదాయమైన కుటుంబమని, పిల్లవాడు సీనియర్ సైంటిఫిక్ ఆఫీసర్గా ఎందులోనో ఉద్యోగం చేస్తున్నాడని చెప్పి మీ నాన్నని వాళ్ళింటికి తీసుకెళ్ళాదమ్మా. మీ నాన్న వెళ్ళి మాట్లాడితే 'మా అబ్బాయికి నచ్చిన పిల్లనిచ్చి పెళ్ళి చెయ్యడం మాకు ముఖ్యం. అంతకుమించి కట్న కానుకలు ముఖ్యం కాదు. మాకు ఒక్క పిల్లాడు. మాకేలోటూ లేదు. వాడి ఆనందమే మా ఆనందం" అన్నారుట. తరువాత "పిల్లా, పిల్లాడూ కలిసి ఒకే కాలేజీలో చదువుకున్నారు గనక ఇంక పెళ్ళిచూపుల ప్రసక్తి లేదు కదా? పైగా వాళ్ళు ప్రేమించుకున్న జంట, ఉత్తరాలు రాసుకుంటున్నారు కూడా. మొన్న మేముకూడా మా అబ్బాయి దగ్గరున్న మీ అమ్మాయి ఫోటో చూసాము. అన్నీ బాగున్నాయి. ఇంక మన మధ్య మాట్లాడుకోవలసినవేమీ లేవు, ముహూర్తం మాత్రం త్వరలో పెట్టించండి, మా అమ్మ పెద్దది 'మనవడిపెళ్ళి చూడాలంటోంది' అని అన్నారుట. మీ నాన్నకి కూడా ఈ సంబంధం బాగా నచ్చింది. 'చాలా మంచివాళ్ళని' అన్నాడు. మీ నక్షత్రాలకి ఇదే ముహూర్తం కుదిరిందట. తరువాత రెండు, మూడు నెలలదాకా ముహూర్తాలు లేవుట. ఈ ముహూర్తానికి పెళ్ళి చేసెయ్యమని వాళ్ళు పట్టుపట్టేరుట. "వాళ్ళడిగింది ఇదొక్కటే కదా? కనీసం ఇదన్నా తీర్చకపోతే ఏం బాగుంటుందని మీ నాన్న "సరే" అని మాటిచ్చి వచ్చారుట. ఎలాగా మీరిద్దరూ చేసుకుందామనుకున్నదే కదాని నీకు ముందుగా వ్రాయలేదంతే! ఇందులో నీకు మేము చెప్పకుండా దాచిందేంలేదు. నీ చదువుకూడా మధ్యలో ఆపమని చెప్పేరుట. నీ ఇష్టాన్నే కానిస్తున్నాం తల్లీ! అదృష్టవంతురాలివి, కోరి మరీ చేసుకుంటున్నారు. మంచి కుటుంబంలో పడుతున్నావు. సరేలే-వెళ్ళి పడుకో చాలా రాత్రయింది. నాకు రేపు బోల్డు పనున్నాయి త్వరగా లేవాలి" అంటూ అటు తిరిగి పడుకుంది.

తల్లిమాటలు విన్న స్వప్న పరిస్థితి మరీ అయోమాయంగా తయారయింది. ప్రమోద్ తనూ ఒకే కాలేజీలో చదివినమాట నిజమే కానీ తను ఎన్నడూ అతన్ని స్నేహితుడిగా తప్ప మరో దృష్టితో చూడలేదు. కాలేజీలో అనేక కార్య క్రమాల్లో ఇద్దరు కలిసి పాల్గొంటూ వుండేవారు. అతని మాటలవల్ల, నడతవల్ల ఆదర్శ భావాలుగల వాడని, ఉన్నత భావాలు గలవాడని మాత్రం అనుకునేది. మంచి మాటకారి. చక్కటి హాస్యపు జల్లుతో మాట్లాడి మనుష్యుల్ని ఆకర్షించగల వ్యక్తి. అతనియందు తనకెటువంటి చెడుభావం లేదు. అలాగని మరో అభిప్రాయం కూడా లేదు. ప్రమోద్‌తో చనువుగా మాట్లాడేది. ప్రమోద్ చదువు పూర్తయిపోయేముందు ఓ సారి మాత్రం తనతో పెళ్ళి ప్రసక్తి తీసుకొచ్చినప్పుడు "నాకు నా చదువు పూర్తయ్యేదాకా ఆ ఆలోచన లేదండీ" అని కచ్చితంగా చెప్పేసింది. దానికతను చిన్న బుచ్చుకున్నట్లు కనపడ్డా, తను దానికేం బాధపడ లేదు. అంతటితో ఆ విషయాన్నే మర్చిపోయింది. మరి అమ్మ "మీరిద్దరూ చేసుకోవాలనుకున్నారు కదా?" అని అంటుందేమిటి? ప్రమోద్ అలా అబద్ధమెలా ఆడేడు? పైగా నా ఫొటో కూడా అతని దగ్గరుందా? నేనెప్పుడూ ఇవ్వలేదే. కాలేజీలో కూడా ఇంతవరకూ ఎక్కడా ఎవ్వరితో ఫొటో తీయించుకోలేదే! ఎలా వెళ్ళిందతని దగ్గరకి? అది అతని తల్లిదండ్రులకి కూడా సిగ్గు లేకుండా చూపించి ఇంత నాటకం ఆడేడన్నమాట! అయితే ఇదంతా ప్రమోద్ పన్నిన పథకమన్న మాట! ఆనాడు తనలా జవాబిచ్చిందుకు నామీద కసికట్టి ఇలా నాటకం ఆడలేదుకదా? నిజానికి ప్రమోద్ అంటే తనకి దురభిప్రాయం లేదు. అప్పట్లో పెళ్ళిచేసుకునే ఉద్దేశ్యం లేక ఇచ్చిన జవాబు మాత్రమే. అంత ప్రేమించిన ప్రబుద్ధుడు తనే వచ్చి మళ్ళీ నాతోటే మాట్లాడివుంటే బాగుం డేది కదా? పైగా నేనూ ప్రేమిస్తున్నానని చెప్పి, నా ఫొటో ఇచ్చినట్లుగా నటించి, ఈ దొడ్డిగుమ్మం వ్యవహారంతో ముహూర్తం పెట్టించడంఎందుకు?" అనుకుంది.

కానీ ఎందుకో ఉదయంనుంచి వున్న దిగులూ, ఆందోళనా ఇప్పుడు స్వప్నలోలేవు. ఒక విధమైన ఆనందంతో హృదయం స్పందించింది. తియ్యటి కోరికలు మనసులో చేలరేగాయి. తనకి తెలియ కుండానే ఊహాలోకాల్లో విహరించ సాగింది. మధురమైన ఊహలతోటే తియ్యటి కలల్లోకి జారు కుంది స్వప్న.

మర్నాడుదయం శేషయ్యగారు స్వప్నని తీసుకుని బజారుకి బయలుదేరారు. మౌనంగా తండ్రి వెంట వెళ్ళిన స్వప్న తనకి నచ్చిన చీరలు, నగలు ఎన్నుకుంది. తిరిగి వస్తుండగా శేషయ్య గారు స్వప్న నుద్దేశించి "స్వప్నా డిగ్రీ అయి పోగానే పెళ్ళి చేస్తామంటే నువ్వే వద్దన్నావు కదమ్మా! ప్రమోద్‌ని చేసుకోవాలని వున్నప్పు డయినా మాతో మాట వరసకి చెప్పుంటే ఎంత బాగుండేది! నీ ఆనందం, సుఖంకంటే మాకు మాత్రం కావలసిందేముందమ్మా! అతనితో అప్పుడే ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా జరుగు తున్నాయిట! నీ ఫొటో కూడా పంపేవుట! ముందుగా మాకూ కాస్త తెలియజేస్తే బాగుండేది కదా! మేము మాత్రం ఇంత మంచి సంబంధాన్ని కాదంటామా?" అని కాస్త నిష్ఠూరంగా అన్న మాటలు వినగానే ఆశ్చర్యం, దుఃఖం ముంచు కొచ్చాయి. "నేనేం ఉత్తరాలు రాయలేదు నాన్న గారూ, పైగా ఫొటోకూడా ఎప్పుడు పంపలేదు" అంది నెమ్మదిగానే అంతకంటే అధికం ఆయనతో అనే ధైర్యం లేక.

"ప్రమోద్ తండ్రి నీ ఫొటో, నీ ఉత్తరం చూసి, కొడుక్కి నచ్చిన పిల్లనే చెయ్యాలని నాకు రామయ్య ద్వారా కబురంపించారమ్మా!" అంటూ నెమ్మదిగానే అన్నా, స్వప్నకి మాత్రం తండ్రి మాటలు ములుకుల్లా గుచ్చుకున్నాయి. దాంతో ప్రమోద్ మీద చెప్పలేని కోపం వచ్చింది. తండ్రి తన మాటలు నమ్మటంలేదు. అబద్ధ మాడుతున్నా ననుకుంటున్నాడు. జరిగినదంతా చెప్పాలనుకుంది. కానీ ధైర్యం చాలటంలేదు. నోరు విప్పలేక పోయింది. అవమానంతో తలదించుకునికూర్చుంది. "కానీ తను వ్రాయకుండా ఉత్తరాలు, తను పంపకుండా తన ఫొటో అతని దగ్గరకెలా వెళ్ళేయా??" అన్న సందేహాలు మాత్రం ఆమె మనస్సుని పట్టి పీడించసాగాయి.

ప్రశ్న ప్రశ్నగానే వుండిపోయింది. దానికి జవాబు దొరక్కుండానే స్వప్న పెళ్ళి ప్రమోద్‌తో అట్టహాసంగా జరిగిపోయింది. అంతా స్వప్న



## గౌరవం

"ఏమిటి! మీ ఆవిడని ఏమండీ అని పిలుస్తున్నావు?" ఆశ్చర్యంగా అడిగాడు అమరనాథ్, గురునాథ్‌ని.

"అవును. మరి నాకు ఉద్యోగం లేదు. ఆవిడ ఉద్యోగస్థురాలు" చెప్పాడు గురునాథ్.

–హిరణ్య (విశాఖపట్నం)

ఆనందం-వాధ –శోభ





## నరకం

బడి మీద వ్యాసం రాయమన్నారు మాస్టారు.

చంద్రం ఇలా రాశాడు.

'బడి ఒక నరకకూపం. హెడ్‌మాస్టారు యముడు టీచర్లు యమభటులు, పిల్లలు పాపం చేసిన మానవులు'

—టి. గోపాల్ (హైద్రాబాద్)

అదృష్టాన్ని కొనియాడారు. "చక్కని ఈడూ, జోడూ-ఒకరి కొకరు ఎందులోనూ తీసిపోరు, ముచ్చటైన జంట" అనుకున్నారు. స్వప్న అత్త మామలు కోడల్ని చూసుకుని మురిసిపోసాగారు. తంతులన్నీ అట్టహాసంగా ముగుస్తున్నాయి.

అది స్వప్న, ప్రమోద్‌ల తొలిరేయి. వారి, వారి మనసుల్లోని భావాలని, కోరికల్ని ఒకటిగా చేర్చి ఆనంద డోలికలో ఉయ్యాల లూగించుకునే రేయి. "తమ జీవితపుబాట పూలబాటగా మలుచుకోవాలి. ఆ బాట ఎల్లప్పుడూ ఈ పూల పాన్పు లాగే మెత్తగావుండాలి" అనుకుంటూ, ఇన్నాళ్ళూ తను కన్న కలల్ని, ఊహించినఊహల్ని మాలగా అల్లుతూ ఆ మాలని స్వప్న మెడలో వెయ్యాలని తపించి పోతున్న ప్రమోద్‌ముఖంలోని ఆనందం, ఆత్రుత కూడా వర్ణనాతీతం. ఆమె రాకకోసం సెకనొక యుగంలా గడుపుతూ ఎదురు చూస్తున్నాడు. "నా కోరిక తీరింది ! తీరబోతోంది !!" అనుకున్నాడు తృప్తిగా.

ఎదురెళ్ళి, సిగ్గుతో ఎర్ర గులాబీ మొగ్గలా ముడుచుకుని నిల్చున్న స్వప్నని చేరదీసి, సరసన కూర్చో బెట్టుకున్నాడు. నెమ్మదిగా ముఖాన్ని పైకెత్తాడు. ఎత్తిన ఆమె ముఖంలో రోషాన్ని చూసి చకితుడయ్యాడు. తనలాగే స్వప్న కూడా ఈ ఆనంద ఘడియల్ని తనతో పంచు కోడానికి, ఉవ్విళ్ళూరుతూ ఎదురుచూస్తుందను కున్న అతనికి ఆమె చూపులు సూటిగా మొండి బాకుతో పొడిచి నట్లయింది.

"ఇంతకీ నేనెప్పుడు మీకు ఉత్తరాలు వ్రాసాను? ఎప్పుడు మీకు నా ఫొటోపంపించాను? నన్ను పెళ్ళాడాలని అంత కోరికగా వుంటే నాతోటే వచ్చి మాట్లాడొచ్చు కదా? ఈ దొంక తిరుగుడు వ్యవహారంఎందుకు? ఈ డ్రామా ఏమిటీ? నేను మిమ్మల్ని ప్రేమించానని చెప్పి, నేను వ్రాసినట్లు ఉత్తరాలు సృష్టించి, నా ఫొటో సంపాదించి మోసగించి పెళ్ళి చేసుకోవడం ఎందుకు?" అంది రోషంగా.

నిరుత్తరుడైన ప్రమోద్ "నువ్వు నాకు ప్రేమలేఖలు వ్రాసావని ఎవరన్నారు?!" అన్నదానికి తండ్రి చెప్పినవన్నీ స్వప్న చెప్పగా విన్న ప్రమోద్ క్షణకాలం తెల్లబోయి, వెంటనే ఏదో స్ఫురించినట్లు అకస్మాత్తుగా లేచి, బీరువా తెరిచి, ఓ కవరు స్వప్నకిచ్చి నవ్వసాగాడు. స్వప్నవళ్ళు భగ్గుమంది, ఆ కవరందుకుని అతనికి దూరంగా జరిగింది. ఆ కవరులోని ఉత్తరం చూసి తెల్లబోవడం ఈసారి స్వప్న వంతయింది. అయితే ఇదన్నమాట "అనుకుంది మనసులో. ఇది మీ దగ్గరకెలా గొచ్చింది?" అంది పిచ్చిదానిలా చూస్తూ.

"వాళ్ళు నన్ను జడ్జిగా పిల్చారు. నేను చూసిన వాటిలో ఇదీవుంది. దీనితో పాటు నీ ఫొటో కూడా వుంది, దీనికి ప్రైజు రాలేదు. కానీ నేను బుట్ట దాఖలు చెయ్యలేక నీమీదున్న ప్రేమకొద్దీ దీనిని నాతో తెచ్చుకుని నా బీరువాలో దాచుకున్నాను. నిన్నుతప్ప మరొకర్ని వివాహం చేసుకోకూడదని ఏనాడో నిశ్చయించుకున్న నాకు ఇది నాదగ్గరుండడం ఎంతో సంతోషాన్ని కలిగించింది రోజూ నీ ఫొటోని చూసుకుంటూ, నీ ఉత్తరాన్ని చదువుకుంటూ, నువ్వు నా దగ్గరే వున్నట్లు ఆనందపడేవాడిని. బహుశా దీనిని మా వాళ్ళు చూసి వుంటారు. ఓసారి మా వాళ్ళు నా పెళ్ళి ప్రస్తావన తీసుకొస్తే నిన్నుతప్ప మరెవర్నీ చేసుకోనని మా వాళ్ళకి చెప్పేసాను. దానివెనక మీ ఫ్రెండ్ ఎడ్రస్ చూసి మా వాళ్ళు బహుశా మధ్యవర్తుల ద్వారా మీవాళ్ళకి కబురుచేసి ఈ వ్యవహారమంతా నడిపించి వుంటారు. నాకు ఏం జరిగిందీ, ఎలా జరిగిందీ తెలీదు. నా పెళ్ళి నీతో నిశ్చయమైందని తెలిసిన క్షణంనుంచి నాకు మరే ఆలోచనలూ రాలేదు. పట్టలేని ఆనందంతో ఈ మధురక్షణాల కోసం క్షణమొక యుగంలా గడిపేను. నన్ను నమ్ము స్వప్నా!" అంటూ అమాయకపు చూపుల్తో వేడుకుంటున్న ప్రమోద్‌ని చూడగానే—

"ప్రియమైన ప్రాణేశ్వరా" అని సంబోధిస్తూ తను ఆంధ్రభూమి ప్రేమలేఖల పోటీకి వ్రాసిన ఉత్తరం దాంతో జతచేసిన ఫొటో గురించి గుర్తొచ్చి సిగ్గుతో తల దించేసుకుంది స్వప్న. అనవసరంగా అపార్థం చేసుకున్న ప్రమోద్ వైపు జాలిగా చూసి, క్షమించమన్నట్లు మూగగానే అడిగిన స్వప్నని ఆరాధనగా హత్తుకున్నాడు ప్రమోద్.

"ఆంధ్రభూమి ఎంత మంచిదో కదూ? మనిద్దర్నీ ఇంత త్వరగా కలిపిన ఆ ప్రేమలేఖల పోటీని నిర్వహించిన ఆంధ్రభూమికి మనం చాలా ఋణపడి వున్నాం కదూ? మరి మన ఈ కథని ఆంధ్రభూమికి వ్రాసి థేంక్స్ చెప్పుకుందాం. ఏమంటావ్' అంటూ స్వప్న చెక్కిలినొక్కాడు ప్రమోద్. ❋

అంతస్పీడా?

—రామకృష్ణ

